# భార్యస్మృతి

ఆ దేశమును ఒక రాజు పాలిస్తున్నాడు. అతడు ధర్మశీలుడు, ఏకపత్నీవ్రతుడు.

ఆ రాజు వివాహమాడిన కన్య బాల్యము నుంచీ అతని ప్రేమ దృష్టులలోనే పెరిగింది. ఆమె హృయాన ప్రేమాంకురాలు పుట్టడానికి అతని ప్రేమ దృష్టులే కారణము. ఆమెలో ప్రేమాంకురాలు పుట్టిన నాటి నుంచి అతని హృదయము రాజ్యము మీద నుంచి మళ్లి ఆమె మీదనే పూర్తిగా లగ్నమయిపోయింది.

వారికి వివాహమైనది. ఎడబాటెరుగని ప్రేమసౌఖ్యములకు వారే పరమావధి అనిపించుకొన్నారు.

వారి ప్రేమ బాల్యములో పుట్టింది, లేతమామిడి చిగురులాగ నవ నవలాడింది. యౌవనములో మందార పుష్పమువలె వారి ప్రేమ వికసించింది. మల్లెపువ్వులాగ వాసించింది.

యౌవనము సడలుతోంది. వారి ప్రేమ దృఢమౌతుంది.

వారి ప్రేమకు ఫలముగా వారికి రత్నాలవంటి కొడుకులూ కూతుళ్లూ పుట్టారు.

సుఖదుఃఖాల కారకమైన సంసారములో పడ్డవాళ్లు మహారాజులైనా, ఎంతటి ప్రేమ వాళ్లలో ప్రజ్వలిస్తూ వున్నా, వాటి ఫలాలను వారనుభవించక తీరదు.

రాణీగారి కష్టలేశము రాజుగారికి మహాకష్టమయ్యేది. రాణీగారి దగ్గరికి దుఃఖలేశమైన చేరకుండా రాజుగారు తమ జాగ్రత్తను, దైవ భక్తిని, అధికారాన్ని, హృదయాన్ని కాపలా ఉంచేవారు.

ఈ విధంగా చాలాకాలం జరిగింది.

విధివశాన ఒకనాడు రాణీగారికి చిన్న జబ్బు చేసింది. మందులిచ్చారు. కుదరలేదు. జబ్బు తీవ్రమయింది. రాజ్యములో ఉండే వైద్య శిఖామణులందరూ ఆలోచించి వైద్యము చేశారు. రోగము తిరుగుముఖము పెట్టలేదు. ఆనాటికానాడు రోగము ముదిరిపోయింది. వాడివాడి, కొమ్మ నుంచి పువ్వు రాలిపోయినట్లు ఆవిడ ఇహలోకాన్ని విడిచిపోయింది. రాజుగారికి రాజ్యములో ఉండే ప్రజలంతా అనునయము కల్పించడానికి ప్రయత్నించారు. రాజుగారెంత దుఃఖించారో ప్రజలంతగా దుఃఖించారు. రాజ్యము రాజ్యమంతా దద్దరిల్లిపోయింది.

రాజుగారికి దుఃఖము తీరలేదు. రాజ్యకార్యములనుంచి విరమించి రాజు తన ప్రేమమూర్తిని నిరంతరమూ ధ్యానిస్తూ కాలం వెళ్లబుచ్చుతున్నాడు. దుఃఖము తీరడం లేదు, స్నేహితులు, బంధువులు, ఆప్తులు ఎవరూ ఏమీ చెయ్యలేకపోయారు. ఆయన ముఖాన మందహాసమైనా ఎప్పుడూ అంకురించడం లేదు.

రాణీగారిని విడిచి రాజుగారు అట్టేకాలం ఉండలేరు అనుకొన్నారు ప్రజలు ప్రజల భగవత్ప్రార్థనలు కూడా రాజుగారి దుఃఖాన్ని అరికట్టలేకపోయినవి.

ఆ రాజ్యములోనే ఒక మర్రిచెట్టుకింద ఒక బిచ్చగాడున్నాడు. అతనికి నడివయస్సు దాటింది. అతన్ని

ఆశ్రయించి, నడివయస్సులో ఉన్న ఒకస్త్రీకూడా ఆ చెట్టునీడనే ఉన్నది. వారిద్దరూ ఆ చెట్టుకిందే నక్షత్రాలనూ, చంద్రుణ్ణి సాక్షులుగా పెట్టుకొని చాలాకాలం కిందటనే పెళ్లి చేసుకొన్నారు.

చిన్నతనములో ఆ బిచ్చగాడు ఆ మర్రిచెట్టు నీడను చేరాడు. ఎందుకు చేరాడో అతనికి తెలియదు. తనను కనిపెంచిన తల్లిదండ్రులెవరో అతనికి తెలియదు. తోటి బిచ్చగాళ్ల సహవాసమువల్ల అతడు బిచ్చమెత్తి పొట్టపోసుకోవడం నేర్చుకున్నాడు. తన చెట్టుకంటే సౌఖ్యప్రదమైన ఆవాసము వేరే ఇంకొక్కటి ఉండవచ్చునని అతడనుకోలేదు.

వేసవికాలంలో సూర్యుడు నిప్పులు కురుస్తూన్నప్పుడూ ఘాళువులు కొట్టుతున్నప్పుడూ ఆ చెట్టు నీడే అతన్ని కాపాడింది. వానాకాలంలో జోరున వానధారలు పడుతూన్నప్పుడూ, ధనికులు తాము వెచ్చగా ఇళ్లల్లో హాయిగా ఉండేటప్పుడూ - ఆ చెట్టునీడ పక్షులకువలెనే అతనికి శరణమయ్యేది. శీతాకాలంలో చలి గడగడ వణికించేటప్పుడూ, రాజులు రకరకాల కంబళీలతో చలిని తరిమివెయ్యడానికి ప్రయత్నించేటప్పుడూ, ఆ చెట్టునీడే అతనికి - చిరుగుగుడ్డలు కప్పుకునే అతనికి - వెచ్చనిచ్చేది. వసంత కోయిలలు అతని చెట్టుమీద కూర్చుని కూసేవి. చిలకలు పలికేవి. సాయంకాలము కాగానే ఆ చెట్టుతొర్రలో కాపురముండే రెండు గుడ్లగూబలు బయటకు వచ్చి అతన్ని పలకరించేవి.

అప్పుడప్పుడు అతని స్నేహితులు - తోటి బిచ్చగాళ్లు ఆ చెట్టు కిందికి వచ్చి అతనితో ఇష్టాగోష్ఠి జరిపేవారు.

అతనికి యౌవనము అంకురించింది. యౌవనానికి జాతి మత విచక్షణలేదు. ధనముతో సంబంధము లేదు. జంతువులూ, మనుష్యులూ అనే భేదం లేదు. వందలకొద్ది భార్యలను పెండ్లాడగల రాజులనే ఆశ్రయించాలని దానికుండదు. కూటికి జరుగని బిచ్చగాళ్ల నాశ్రయించడమెందుకనుకోదు, యౌవనం రాజుల నాశ్రయించిన తాను బిచ్చగాళ్లనాశ్రయిస్తే పరువులోపమేమో ననుకోదు. నల్లవాళ్ల నాశ్రయిస్తే తెల్లదొరలకు కోపం వస్తుందేమోనని కూడా అనుకోదు.

అతనికి యౌవనం అంకురించడంతోనే ఏదో ఒక "వదలని కోరిక" అతనిని పట్టుకొంది. ఏమిటో తెలియదు. బిచ్చమెత్తుకొని పొట్టనింపుకోవాలనే సంగతి అప్పుడప్పుడు మరిచేవాడు.

ఒకనాడు రైలు స్టేషనులో అడుక్కోడానికి అతడు వెళ్లాడు. ఆ రైలు నుంచి ఒక ఆడపిల్ల దిగింది. చిరుగు గుడ్డలలో నుంచి పడుచుతనపు లావణ్యము పైకి ఉరుకుతోంది. పిల్ల గేటుదగ్గరికి వచ్చింది, టిక్కట్టులేదు. బంట్రోతు మెడమీద చెయివేసి గెంటాడు. తూలి కింద పడింది. జారిపోయిన బట్టలమూట తీసుకొంది. నవ్వింది. బిచ్చగాడు చూచాడు. తన బసకు ఆమెను తీసుకువెళ్లాడు. ఆనాడే ఆ చెట్టుకిందే వారికి వివాహం జరిగింది.

ప్రతిరోజూ వారిద్దరూ కలిసి బిచ్చానికి బయలుదేరేవారు.

ఆ కోయిలల కూజితములలో, ఆ చిలుకపలుకులలో, ఆగుడ్ల గూబల కూతలలో, ఆ వెన్నెలలో, ఆ ఘాళువులలో, ఆ చలిలో, ఆ ఎండలో తమ జీవితాన్ని కలిపివేసుకొని ఆ చెట్టునీడలో వాళ్లు సుఖమూ

అనుభవించారు. రాజులనుభవించే సుఖమే. గొప్పవాళ్లనుభవించే సుఖమే. దుఃఖమూ అనుభవించారు - రాజులూ, గొప్పవాళ్లు అనుభవించేలాంటి దుఃఖమే!

వాళ్లకు మధ్యమధ్య సంతానం కూడా కలిగింది. పిల్లలు కాలు రావడంతోనే ఏదో ఒక చిప్పపట్టుకొని తల్లిదండ్రులను వదలిపెట్టి ఏదో ఒక చెట్టునో, ఒక వీధినో ఆశ్రయించేవారు. వారికి కలిగిన సంతానమంతా ఈ విధముగా అన్ని దిక్కులకూ చెదిరిపోయారు. బిచ్చగాడూ వాడి భార్య ఈ విధంగా కాలక్షేపం చేస్తూ ఉండగా ఒకనాటి సాయంకాలం విధివశాన ఆమెకు చిన్న జబ్బు చేసింది. రాత్రల్లా మేలుకొని ఆమె జబ్బును తన ఆలోచనలతో కోరికలతో పోగొట్టవలెనని అతడు ప్రయత్నించాడు. తెల్లవారే సరికి జబ్బు నిమ్మళించలేదు. సరికదా ఆమె బిచ్చానికి బయలుదేరడానికి కూడా ఓపిక లేకపోయింది. ఆమెను ఈ చెట్టుకిందే పడుకోబెట్టి తన భుజం మీద గుడ్డ ఆమెకు కప్పి బిచ్చగాడు తన చిప్పా, కర్రా పుచ్చుకొని బిచ్చమెత్తుకోడానికి బయలుదేరాడు. బయలుదేరకపోతే ఎట్లా? ఆ రోజుకు గంజేదీ?

ఒంటరిగా వచ్చేవేమని తోడిబిచ్చగాళ్లు అడిగారు. చెప్పాడు, అందులో ఒకడు మాత్ర ఇచ్చి ఆమెకు వెయ్యమన్నాడు. బిచ్చగాళ్లలోనూ వైద్యులున్నారు. కొన్ని వీధులు తిరిగి కొంచెం బియ్యం బిచ్చమెత్తుకొని ఇంటికివచ్చి భార్యకు మాత్రవేశాడు. బియ్యం చెట్టు కిందే ఉడికరిచాడు. తానింత తిన్నాడు. భార్య తినేస్థితిలో లేదు. మిగిలిన గంజీ కూడా అక్కడ వదలిపెట్టి భార్య దగ్గిర చేరి ఆమెకు ఉపచారం చేస్తున్నాడు. రోగం మాత్రం ముదురుతోంది. కొన్నాళ్లు గడచినవి. ఆమెకు బ్రతికే యోగ్యతలేదని బిచ్చగాళ్లు నిశ్చయించారు. ఒకనాటి రాత్రి ఆమె ఆ చెట్టుకిందే ప్రాణాలు వదలిపెట్టింది. బిచ్చగాడు ఆమె పక్కనే కూచున్నాడు. అతడుపడ్డ కష్టాలూ, అతడు పొందిన దుఃఖమూ ఆ మర్రిచెట్టుకు తప్ప ఇంకెవరికీ తెలియవు.

రెండు రోజులయింది. ఆ బిచ్చగాడు ఒక్కడూ ఆ చెట్టుకిందే పడిఉన్నాడు. మూడోరోజువచ్చింది. ఆకలి వేసింది. జోలి చూచుకొన్నాడు. కుక్కలు జోలి పీకివేసి బియ్యం తినివేసినవి. తోడి బిచ్చగాళ్లు తమ పొట్టకోసం తంటాలుపడుతూ అతని సంగతే మరిచారు. చిరిగిన జోలి చేత్తో పుచ్చుకొని తూలుతూ ఆ బిచ్చగాడు ఇంటింటికి బిచ్చమెత్తడానికి వెళ్లాడు. "మొద్దులావున్నావు, కూలి చేసుకోకూడదా" అన్నారు కొందరు మామూలు ప్రకారం. "చెయ్యి ఊరుకోలే"దన్నారు కొందరు. "పాడితేనేగాని బియ్యం వెయ్య"మని కొందరు పిల్లలన్నారు. మధ్యాహ్నమయింది. ఒక ముసలి ముత్తయిదువ 'గంజి తాగుతావా అబ్బీ' అంది. దాక పట్టేడు. ఆమె పోసిన గంజి తాగాడు. మర్రిచెట్టు కిందికి వచ్చాడు. జోలి తలకింద పెట్టుకొని కళ్లు మూసుకొన్నాడు.

రోజురోజూ అతడు బిచ్చానికి వెళ్లుతూనూ ఉన్నాడు. పొట్ట నింపుకొంటూనూ ఉన్నాడు. ఏదో ఒక విధంగా, భార్యనప్పుడప్పుడు తలుచుకొంటూనూ ఉన్నాడు. యధాప్రకారం కోయిలలు కూస్తూనూ ఉన్నవి. చిలకలు పలుకుతూనూ ఉన్నవి. గుడ్లగూబలు సాయంకాలం కావడంతోనే అతన్ని - అతన్ని ఒక్కణ్నే పలకరిస్తూ ఉన్నవి.